
క్లుప్తంగా

3న సామూహిక అక్షరాభ్యాసాలు


జ్ఞాన సరస్వతి అమ్మవారు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో ఫిబ్రవరి 3వ తేదీ వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ తెలిపింది. ఆలయంలో కొలువైన జ్ఞాన సరస్వతి అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాల అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

హనుమద్ ఉత్సవాలు ప్రారంభం


అభయ ఆంజనేయస్వామి

కొయ్యలగూడెం: కన్నాయిగూడెంలోని కొలువైన శ్రీకార్యసిద్ధి అభయ ఆంజనేయస్వామి వారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం విశేష పూజలు, అర్చనాది అభిషేకాలు నిర్వహించారు, సాయంత్రం నుంచి స్వామి వారికి ప్రీతిపాత్రమైన లక్ష తమలపాకుల పూజ నిర్విరామంగా ఆరు గంటల పాటు నిర్వహించారు. 30వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా హనుమద్ వ్రతాన్ని తొలి రోజు నిర్వహించారు. 1వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని సువర్చలా సమేత హనుమద్ కల్యాణం, మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన సాయంత్రం నుంచి స్వామి వారి గ్రామోత్సవం చేపడతామని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పశు వైద్య శిబిరం ఏర్పాటు


రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఆరు పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స చేశారు. 600 మేకలకు పాక్స్ వ్యాక్సిన్, నట్టలు నివారణ మందు తాగించారు. 500 కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా ఉండటానికి టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పీఎస్‌వీ శేఖర్‌దొర ముఖ్య అతిథిగా హాజరై పశు సంబంధిత జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ దుర్గా ప్రసాద్, పశు సంవర్ధక సహాయకులు పి.సాయిరామ్, కె.నతీష్, కె.వేంకటేశ్వరరావు, వీరబాబు, టి.వేంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రకాశం డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గణేష్ సెంటర్‌లో మానవహారం నిర్మించి రోడ్డు భద్రత అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై వి.చంద్రశేఖర్, ఏఎస్ఐ ఎం.సుబ్బారావు ట్రాఫిక్ రూల్స్ భద్రత అంశాల గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల కర్సపాండెంట్ వి.జనార్దన్‌రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ హనుమాన్‌చౌదరి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, శ్యామ్, ఇళ్ల పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో గల పౌరసరఫరాల శాఖ మండల లెవల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్ పాయింట్)ను ఆర్డీవో ఎంవీ రమణ శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో రికార్డులను, ఓపెనింగ్ స్టాక్, క్లోజింగ్ స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. రేషన్ సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. అన్నీ సక్రమంగా ఉండటంతో ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రమేష్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో అన్నప్రాశనలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శుక్రవారం చిన్నారుల అన్నప్రాశనల వేడుకలతో కళకళలాడింది. మాఘమాసంలో మంచి ముహూర్తం కావడంతో పెద్ద ఎత్తున ఈ వేడుకలను జరుపుకున్నారు. దీంతో క్షేత్ర పరిసరాల్లో సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తమ చిన్నారులకు ఆలయ అనివేటి మండపంలో అన్నప్రాశనలు చేశారు.

మంచు టెండలు


ముంజులూరులో ఉదయం మంచుకు చలి కాగుతున్న ప్రజలు


మధ్యాహ్న సమయంలో కాస్తున్న తీవ్రమైన ఎండ

- విభిన్న వాతావరణంతో భానుడి ప్రతాపం
- ఉదయం మంచు, మధ్యాహ్నం తీవ్రమైన ఎండ, రాత్రి చలి.. ఆరోగ్యంపై ప్రభావం

బుట్టాయగూడెం: వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత కొద్ది రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో విభిన్నమైన పలు వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి వేళల్లో తీవ్రమైన చలి గాలులు విజృంభిస్తుండగా ఉదయం పొగమంచు కమ్మేస్తుంది. అలాగే చలి గాలులు కూడా తీవ్రంగా వీస్తున్నాయి. మధ్యాహ్న సమయానికి తీవ్రమైన ఎండ దంచి కొడుతుంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భానుడు తన ప్రతాపం చూపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వాతావరణ మార్పులతో ఆరోగ్య సమస్యలు

ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వలన ఏజెన్సీ ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే మంచు, ఎండల కారణంగా విపరీతంగా దోమలు పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా మలేరియా కేసులు కూడా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలో సుమారు 56 గ్రామాల వరకూ మలేరియా సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయి. వీటిలో ముందస్తుగా చర్యలు చేపట్టకపోతే మలేరియా జ్వరాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉదయం చలి, మధ్యాహ్నం తీవ్ర ఎండ



గిరిజన గ్రామాల్లో ఉదయం చలి మంచు కురుస్తుండగా మధ్యాహ్నానికి తీవ్రమైన ఎండలు తారెత్తుతున్నాయి. కాలం మార్పులతో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఫిబ్రవరి ప్రారంభం కావడంతో వేసవి కాలం కూడా సమీపిస్తున్నట్లు కనిపిస్తుంది.

–మడకం వెంకటేష్, అలివేరు, బుట్టాయగూడెం మండలం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి. ఉదయం మంచు, చలి గాలులతో పాటు తీవ్రమైన ఎండలు కాస్తున్నందున జ్వరాల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మలేరియా కేసులు పెరిగే అవకాశం ఉంది. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల నివారణకు మలేరియా శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మే 15వ తేదీ నుంచి గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు చేపడతాం.

–వి.పెద్దిరాజు, సబ్‌యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

కోర్టు ట్రైనీ మీడియేటర్‌గా శ్రీనివాసరావు


అభినందన సభలో న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం: స్థానిక న్యాయ స్థాన ట్రైనీ మీడియేటర్‌గా నియమితులైన న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు శిక్షణ పూర్తి చేసుకున్నారు. భారత ప్రభుత్వం 2023లో చేసిన వివాద పరిష్కార చట్టం (ఇండియన్ మీడియేషన్ యాక్ట్) ప్రకారం దేశంలోని ప్రతి న్యాయస్థానంలో మధ్యవర్తులను నియమించి కేసులు పరిష్కరణలో భాగంగా సుప్రీంకోర్టు రూపొందించిన 40 గంటల ట్రైనింగ్ కార్యక్రమం జనవరి 27 నుంచి 31 వరకు ఏలూరు జిల్లా న్యాయస్థానంలో నిర్వహించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిక్షణ పూర్తి చేసుకున్న 34 మంది న్యాయవాదులను జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి సీహెచ్ సునీల్ కుమార్, అదనపు జిల్లా న్యాయమూర్తి మంగ కుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్ అభినందించారు.

ముత్యాలమ్మకు అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేక పూజాది కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో అర్చకుడు కె.విజయశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని బొమ్మగాని ధర్మరాజు, అరుణ్‌కుమార్, చోడవరపు రంగ, జ్యోతి, ప్రసాద్, విజయలక్ష్మి, మారిశెట్టి మంగ, వంకాయల వాసవీ, లైటింగ్ శ్రీను, బ్రహ్మం, టిప్‌టాప్ చంటి, దువ్వ రామకృష్ణ, యర్రా నాగేశ్వరరావు, సత్య, రామకృష్ణ, అనురాధ తదితరులు దర్శించుకున్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి వెండి చీర తయారీకి కోర్ల నాగలక్ష్మి (వీరన్నగూడెం) ఐదు తులాల వెండిని అందజేశారని తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,01,116 లను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన ఎస్.వెంకటరుద్ర కామేశ్వర నాగ మహేంద్ర గుప్తా ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నిర్వాసితులతో ఆర్డీవో సమావేశం


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఎంవీ రమణ

పోలవరం రూరల్: పోలవరం నిర్వాసితులతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణంతో మొదటి విడత ఖాళీ చేసిన గ్రామాల్లో ఇంటి నిర్మాణం సొమ్ము అందని వారితో పోలవరం రెవెన్యూ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం సొమ్మును చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 73 మంది నిర్వాసితులకు గృహ నిర్మాణాలకు సంబంధించి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3.15 లక్షల చొప్పున గతంలో ప్రకటించిన విధంగానే నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, డీటీ కె.శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుక్కునూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని లంకాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు బర్లమడుగుకు చెందిన కాకి బాబు, జగిడి వెంకమ్మ బైక్‌పై కుక్కునూరు వస్తుండగా రోడ్డుపై కంకర రాళ్ల కారణంగా బైక్ జారిపడి ఇద్దరూ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కాకి బాబుకు తీవ్ర గాయాలు కాగా వెంకమ్మ స్పృహ కోల్పోయింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు 108కి ఫోన్ చేయగా అంబులెన్స్ మరో కేసుపై వెళ్లడంతో ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ శేఖర్ తన కారులో బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగా రోడ్డు మరమ్మతులు మధ్యలో ఆగిపోయి అధ్వానంగా మారింది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నా ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరించడం సరికాదని పలువురు వాఖ్యానిస్తున్నారు.

11 నుంచి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు


వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కామవరపుకోట: ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కోటలో కొలువైన శ్రీభద్రకాళి వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు అఖిల గాండ్ల తెలికుల సంఘ ఆధ్వర్యంలో నిర్వహించబడునని ఉత్సవ కమిటీ సభ్యులు బొల్లు వెంకట సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11వ తేదీన గండ దీపాలు, అదే రోజు తేలికుల సంఘ ఆధ్వర్యంలో నారసాలు, 12వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు శ్రీవీరభద్రస్వామి కల్యాణం, వీరభద్రస్వామి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం, 13న రథోత్సవ కార్యక్రమం, రాత్రి వెంకీ ఆర్కెస్ట్రాచే సినీ మ్యూజికల్ నైట్, 14న ముచ్చటైన మూడు రత్నాలు నాటిక, 15న స్వరాభిషేకం సినీ సంగీతం, 16న స్వరాజ్ ఈవెంట్స్, 17న మోహన్ ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్, 18న రేలారే రేలా సంగీత విభావరి, 19న రాక్ స్టార్ సినీ ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలు నిర్వహించబడనని భక్తులు విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మారం నాగేశ్వరరావు, ప్రసాద్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు


కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ అడిషనల్ డీజీపీ పి.విజయానంద్

చింతలపూడి: కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చని రిటైర్డ్ అడిషనల్ డీజీపీ పి.వి జయానంద్ సూచించారు. మండలంలోని యర్రంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయానంద్ పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు లక్ష్య సాధనలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, యర్రంపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు జె.చెన్నకేశవరెడ్డి, యర్రంపల్లి హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ శివరాం, మానవత చైర్మన్ ఎ.అప్పారావు, జిల్లా జాయింట్ సెక్రటరీ పి.సోమశేఖర్, మానవత కన్వీనర్ కె.నాగ చిన్నారావు, కె.సత్యనారాయణ, ఎస్.అశోక్ బాబు, జె మురళీధర రెడ్డి, జి నరసింహారావు, జె భక్త వత్సల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి: నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో వడ్డెరగూడెంలో వల్లెపు లింగయ్య వద్ద ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఆర్‌వీఎల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ద్వారకాతిరుమల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన చిట్టి వెహికల్ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది నాగలక్ష్మి, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విజయభారతి, మెహర్‌జ్యోతి, గోదాదేవి, ద్వారకాతిరుమల, పంగిడిగూడెం జీఎంఎస్‌కే లక్ష్మీసుజన, నసీమ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులను ప్రోత్సహించాలి

బుట్టాయగూడెం: గిరిజనులు ఐటీడీఏ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వారి పిల్లలను ఉన్నత చదువుల్లో ముందుకు సాగేలా కృషి చేయాలని ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వదిత్య శంకరనాయక్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన రేగులపాడు, రేపల్లె, లంకపాకల గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఏటీడబ్ల్యూఓలు శ్రీవిద్య, జనార్ధన్‌రావు, సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ మెంబర్ పర్యటన

పోలవరం రూరల్: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎస్టీ కమీషన్ మెంబర్ వై.శంకర్ నాయక్ పర్యటించారు. రెడ్డికుంకాల, పాత కుంకాల గ్రామాల్లోని గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో చర్చించారు. వసతి గృహంలో సౌకర్యాలు, ఉపాధ్యాయుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, ఏపీఎం జేమ్స్, ఏపీవో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ద్వారకాతిరుమల: స్థానిక మార్కెట్ యార్డులో శ్రీవేంకటేశ్వర నిమ్మకాయల వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దొరసానిపాడుకు చెందిన చిట్టిబొమ్మ గంగాధరరావు మొత్తం 47 ఓట్లకు గాను, 19 ఓట్ల మెజారిటీతో గెలుపొంది, సంఘ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా మద్దిపాటి సోమేశ్వరరావు (దొరసానిపాడు), ట్రెజరర్‌గా అబ్బూరి శ్రీనివాసరావు (వెంకట కృష్ణాపురం), సభ్యులుగా వనమట్ల శివశంకర్ (గుండుగొలనుకుంట), సర్నాల సోమరాజు (వెంకట కృష్ణాపురం), ఘంటా శ్రీనివాస్ (తిమ్మాపురం), ఒంటిపల్లి జోషి (కామవరపుకోట మండలం ఈస్టు యడవల్లి), పాకలపాటి భాస్కర సురేష్ (వెంకటకృష్ణాపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. రెండేళ్లపాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని సంఘ నూతన అధ్యక్షుడు గంగాధరరావు తెలిపారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


కొయ్యలగూడెం: సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కామవరపుకోట: వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు


ద్వారకాతిరుమల: పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న గోపాలపురం ఎమ్మెల్యే


పోలవరం రూరల్: వాసవీమాత గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం కొయ్యలగూడెం కన్నాపురం గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 108 లీటర్ల పాలతో పంచామృతాభిషేకాలు, మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అదే విధంగా కన్నాపురం గ్రామంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా సామూహిక పూజలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిరవూరి శ్రీనివాసరావు, వాసవి ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మ శ్రీనివాసరావు, కొయ్యలగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మార్టూరు సుధీర్, జిల్లా నాయకులు కొల్లూరు సత్తిబాబు, కొల్లూరు గెరటయ్య, కాకి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి అష్టోత్తర పూజలు

కామవరపుకోట: టీవీఏ చినరాజప్ప ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొలువైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం అష్టోత్తరపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు కాకి గోపాలరావు, వందనపు మురళీ, బచ్చు వెంకటేశ్వరరావు, జయవరపు ప్రసాద్, కాకి సూరిబాబు, బచ్చు ముత్యాలరావు, కాకి సురేష్ కుమార్, వాసా వాసు, కొండూరు శ్రీధర్ పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

పోలవరం రూరల్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం గ్రామంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

క్షేత్రంలో

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం పురోహితులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు.మధ్యాహ్నం అభిషేకాలు చేశారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అమ్మ వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పండితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాన్ని అందించి, పూజలు చేయించారు.

కోడి పందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీసులు శుక్రవారం కోడి పందేలపై దాడులు నిర్వహించారు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అక్కంపేట గ్రామశివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.400 నగదు, ఒక కోడి కత్తి, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3,490 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.